# చీకటిలో చందమామ

2000 సంవత్సరంలో 'చీకటిలో చందమామ' అనే పేరుతో నేనొక నవల వ్రాశాను. ముందుగా ఒక పత్రిక లోనూ, రెండేళ్ళ తర్వాత పుస్తకంగానూ వచ్చిందది. ఆ నవల అమెరికాలో నా చుట్టూ జరిగిన సంఘటనల మీద అల్లినదవటం చేతా, ఆ కథాంశం ఒక వ్యక్తి మరణించటానికి డాక్టర్లు ఇచ్చిన మూడు నెలల సమయంలో తను సిద్ధపడి, తన కుటుంబాన్ని ఎలా సిద్ధం చేశాడో చెప్పేది కనుక పాఠకుల హృద యాలని బాగా కదిలించింది. అప్పుడు వచ్చినన్ని ఈమెయిల్స్ నా ఏ ఇతర రచనలకీ రాలేదు.

ఈ విషయం ఎందుకు వ్రాస్తున్నానంటే, ఇందాక ఆఫీసునించీ ఇంటికి వస్తున్నప్పుడు కారులో రేడియో వింటున్నాను. అలాటి విషయం మీదే నిజంగా జరిగిన సంఘటనల గురించి చెబుతూ, ఆ వ్యక్తులతో ఇంటర్వ్యూ చేసిన వార్తా కథనం అది. ఆ కథ వింటుంటే మనసు అదోలా అయి, కారు రోడ్డు పక్కన ఆపి అదంతా పూర్తిగా విన్న రెండు నిమిషాలకి బయల్దేరాను. రాద్దామనుకున్న విషయాలు మరిచిపోకుండా వెంటనే వ్రాస్తున్నాను.

0 0 0

అనగా అనగా అమెరికాలోని ఒక వూళ్ళో స్టీవ్ అనే ఒకతనున్నాడు. అతనోసారి సామాజిక సేవ చేస్తూ దక్షిణ అమెరికా వెళ్ళినప్పుడు, అక్కడే అనాథ పిల్లల స్కూలులో టీచర్‌గా పనిచేస్తున్న బెత్ అనే ఒక అమెరికన్ అమ్మాయిని చూశాడు. చూపులు ఎలాగో కలిశాయి కదా అని, మనసులు కూడా కలిపేసుకుని మనువాడేశారు. తర్వాత పదకొండేళ్ళు సంతోషంగా సంసార జీవితం గడిపి,

తత్ఫలితంగా ఆ ఇద్దరూ ఇద్దరు పిల్లలతో నలుగురయారు.

అప్పుడే అతనికి తలనొప్పి వచ్చింది. మామూలు తలనొప్పి కాదు, తల పగిలేటంత నొప్పి. డాక్టర్ దగ్గరికి వెడితే బ్రైన్ ట్యూమర్, అనగా ఎవ్వరూ వినకూడదనుకునే మాట 'కాన్సర్' అన్నారు. అంతేకాదు బాగా ముదిరి పోయిందన్నారు. అంతటితో ఆగలేదు, టెర్మినల్ కాన్సర్ అన్నారు. అనగా కనీసం నాలుగు నెలలు బ్రతకగలిగితే పెద్ద అదృష్టమేనన్నారు.

ఆ రోజు ఇంటికి వచ్చి సరాసరి మేడ మీదకి వెళ్ళిపోయాడు స్టీవ్. బెత్ ఆశ్చర్యపోయింది, రోజూ రాగానే పిల్లలతో గడిపే మనిషికి రోజు ఏమయిందా అని. ఇంటికి రాగానే మంచం మీద పడుకుని, దిండులో తల పెట్టుకుని ఏడ్చానని తన గొంతుతో తనే చెప్పాడు స్టీవ్ రేడియోలో.

డాక్టర్లు తనెక్కువ రోజులు బ్రతకడని చెప్పాక, ఒక నిర్ణయానికి వచ్చాడు. మరణ ముహూర్తానికి దగ్గరవుతున్న వ్యక్తుల మనోభావాలు ఎలా వుంటాయో, అటు రీసెర్చి చేసేవాళ్ళకే కాక, ఇటు సామాన్య మానవులకి తెలియపర్చాలనుకున్నాడు. అందుకని టేప్ రికార్డర్‌లో తన మనసు ఏం చెబితే అదే చెప్పేవాడు. తను ఎందుకు తన చివరి మాటలు రికార్డు చేస్తున్నాడో చెప్పి, అవి ఎలా సైకలాజికల్ కౌన్సెలింగ్ చేసేవాళ్ళకి ఉపయోగ పడితే అలా వాళ్ళని వాడుకోమన్నాడు. తను చనిపోయిన తర్వాత తన భార్యకి ఆ టేపు అందజేసే ప్లాన్ కూడా సిద్ధం చేసుకున్నాడు.

రాబోయే తన చావుకన్నా కూడా, తనెక్కువగా ఆలోచించింది ఈ రెండు విషయాల గురించి అని చెప్పాడు. ఒకటి తన నలభై ఏళ్ళ భార్య జీవితం వికలా వికలం అవుతుందనీ, ఆవిడ వయసు మీరాక పక్కన వుండి సహాయం అందివ్వటా నికి తను వుండబోవటం లేదనీ ఆమెని మోసం చేసి తను వెళ్ళిపోతున్నాననీ అన్నాడు. ఇక రెండవది పిల్లల గురించి. తండ్రి లేని పిల్లలు క్రమశిక్షణతో ఎలా పెరుగుతారో, వాళ్ళని రోజూ టెన్నిస్‌కి బేస్‌బాల్‌కి తీసుకువెళ్ళటం తన భార్య ఒక్కత్తికీ ఎంత కష్టమయిపోతుందో... అంటూనే ఇక మాట్లాడలేక ఆగిపోయాడు.

అతనన్న ఆ మాటలు మొదటిసారిగా రేడియో స్టేషన్‌లో వింటున్న బెత్, బాధగా 'ఇతనెప్పుడూ ఇంతే. తన గురించే పట్టించుకోడు... చివరికి వెళ్ళేటప్పుడు కూడా ఇంతే... ఏం మనిషో... ' అంటూనే విలపించింది.

అసలీ టేపులు ఈ రేడియో స్టేషన్ వాళ్ళెందుకు ప్రసారం చేస్తున్నారు?

ఆ టేపులు బెత్ తీసుకువచ్చింది!

స్టీవ్ చనిపోయిన ఒక సంవత్సరం దాకా అతని జ్ఞాపకాలతో బ్రతుకుతూ, ఆ టేపులు వినటానికి ధైర్యం చాలలేదన్నది. మొదటిసారిగా తనూ రేడియో స్టేషన్‌లోనే వింటున్నానన్నది.

'చనిపోయిన తర్వాత మళ్ళీ జన్మ వుందని నమ్ముతారు కొందరు. ఆత్మకి మరుజన్మ వుండదు అంటారు కొందరు. అదేమీ కాదు సర్వం మట్టిలో కలిసి పోతుంది అంటారు ఇంకొందరు. దాని సంగతేమిటో తెలుసుకునే అవకాశం వచ్చింది నాకు' అంటాడు స్టీవ్ అదోలా నవ్వుతూ.

అవును. నీకు తెలుస్తుంది బాబూ. మరి మాకెలా చెబుతావ్, మాకెలా తెలుస్తుంది అనుకున్నాను మనసులో.

అతనికి ట్రీట్‌మెంట్ మొదలయాక, ప్రతిరోజూ భిన్నంగా వుండేదనీ, ఆశా నిరాశల మధ్య కొట్టుకునేవాడిననీ చెప్పాడు. ఒక పక్క కీమో థెరపీ, రెండో పక్క రేడియేషన్ అతని మానసిక స్థితిని దెబ్బతీశాయంటాడు. ఒక్కొక్క రోజు బాగానేవున్నా చాల రోజులు శారీరకమైన బాధే కాకుండా మానసికంగా ఒక విధమైన డిప్రెషన్‌లోకి వెళ్ళిపోయేవాడుట.

అసలు జీవితమంటే ఏమిటి? చనిపోయేవాడు పుట్టటమెందుకు? పుట్టినవాడు చచ్చిపోతానని తెలిసినా మనిషిగా ఎందుకు బ్రతకడు? అనే ప్రశ్నలు తనకి తనే వేసుకునేవాడుట. ఆచార వ్యవహారాల్లో మునిగిపోయిన ఈ మతాలేవీ వాటికి జవాబులివ్వలేవంటాడు.

ఒక్కొక్కసారి తన కుటుంబం మీద విపరీతమైన ప్రేమ పెల్లుబికి వస్తే, ఇంకోసారి తన దారిన తాను వెళ్ళిపోతుంటే ఇక వీళ్ళెవరు, వీళ్ళతో పనేముంది అనిపించేదిట. అంతేకాదు మామూలుగా ఒక వూరికి వెడుతుంటేనే, ఎన్నో పనులు పూర్తి చేసుకోవాలి, మరి తను శాశ్వతంగా వెళ్ళిపోతున్నాడు కదా ఏమేం పూర్తి చేయాలి? అసలు చేయాల్సిన అవసరం వుందా? ఇలాటి హృదయాన్ని కదిలించే మాటలు ఎన్నో రికార్డ్ చేశాడు. అది విని బెత్ భోరుమంది.

'అవును. అప్పుడప్పుడూ నాకూ అదోలా అనిపించేది. ఒక్కొక్కరోజు పిల్లలిద్దర్నీ వదలకుండా హత్తుకు తిరిగేవాడు. కొన్నిసార్లయితే మా ముగ్గుర్నీ కావలించుకుని దగ్గరే కూర్చోబెట్టుకునేవాడు. ఒక్కొక్కసారి మమ్మల్నసలు పట్టించుకోకుండా దూరంగా, ఒంటరిగా కూర్చునేవాడు. పిల్లలు ఒకటి రెండుసార్లు అడిగారు కూడాను, నాన్నకి మేమంటే ఇష్టం లేదా అని. నేనే సర్ది చెప్పాను అలాటిదేమీ కాదు, ఆయన మానసిక పరిస్థితి అంత సరిగ్గా లేదు అని' అంది బెత్.

స్టీవ్ ఇంకొక మాట కూడా చెప్పాడు. తను రికార్డ్ చేస్తున్నట్టుగా ఎవరికీ తెలియకూడదని రహస్యంగా ఎవరూ చూడకుండా ఆ పని చేసేవాడుట!

చివరికి ఒక రోజు టేపులో అన్నాడు 'నా బరువు బాగా తగ్గిపోయింది. నాలో ఏ పని చేయటానికి శక్తి చాలటం లేదు. ఇంకా కొన్ని రోజులు మాత్రమే బ్రతుకుతానేమో. ఈ టేపులో మాట్లాడటానికి కూడా నాకు ఓపికా లేదు, మనసూ రావటం లేదు. ఇదే ఆఖరిసారిగా నేను చెబుతున్న మాటలేమో' అన్నాడు.

అవును! అవే అతని ఆఖరి మాటలు!

ఆ మర్నాడే అతను చనిపోయాడు!

0 0 0